


# చెట్టమ్మ ఒళ్లో



"బాబూ!"

కిళ్లీకొట్టు బెంచీమీద కూర్చుని సంయుక్తంగా చదువుతున్న సెక్సు నవల్లోని అత్యంత రసవత్తరమైన ఘట్టంలో మునిగి ఉన్న యువకులిద్దరూ తలలెత్తి చూసి ఉలిక్కిపడ్డారు.

"హౌస్ ఆఫ్ వాక్స్ సినిమాలో వాడి ముఖం కన్నా భయంకరంగా ఉందిరా!" అన్నా డందులో ఒకడు ఒక్క నిమిషం ఆగి.

"బాబూ, ధరమం."

"ఫో ఫో, అలా పైకి ఫో." రెండో వాడు కసిరి కొట్టాడు.

ఒక ముసలాడి ఆసరాతో ఆ అభాగ్యుడు కదిలిపోతూంటే రెండో యువకుడు మొదటి వాడితో ఇలా అన్నాడు: "ఈ ముష్టివాళ్ళు కొందరు అలా కావాలనే ముఖాలు భయంకరంగా చేసుకుంటారట్రా. కొందరు తమ బిడ్డల్నీ, ఎత్తుకొచ్చిన బిడ్డల్నీ పసితనంలోనే గుడ్డివాళ్లనీ, కుంటివాళ్లనీ చేసి ఈ వృత్తికి వాడుకుంటారట." దానికి మొదటి యువకు డేదో అన్నాడు. ఆ తరవాత ఇద్దరూ కిచకిచ నవ్వుకున్నారు.

"అయ్యా, ఆళ్ల మాట లిన్నావా?"

"నేదురా. ఆ ళ్లేదో ఎంగిలిపీసులో గుసగుసలాడితే నాకేం ఇనపడుద్ది? అసలే సెవిటోణ్ని."

"అదెంగిలిపీసు కాదు. మన బాసే. నిజంగా నా మొహం అంత అసహ్యంగా ఉంది్రటా, అయ్యా?"

ముసలాడు మాట్లాడలేదు.

"అయ్యా, మబ్బు కమ్మిందేటి? సల్లబడ్డాది."

ముసలాడు మాట్లాడలేదు.

"మనం సెట్టుదగ్గరున్నా వేటి? ఇసనగ్రరలా ఇసరతా ఉంది సల్లగా. పైన పిట్ట లే వైనా ఎగురుతున్న య్యేవో సూడయ్యా."

"ఊరుకోహే, గుడ్డి సన్నాసి. ఎదవ గోలాని. ఎదవగోల". చీదరించుకున్నాడు ముసలాడు.

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు.

(అయ్యకి నేనంటే ఎందుకో అంత మంట? సీటికీ మాటికీ ఇసుక్కోడమే. సల్లగా, హాయిగా ఉంది. పైన మబ్బే సిందిలా ఉంది. ఇప్పుడు పిట్ట లెగురుతా ఉంటే బలే బాగుంటాది. హాయిగా ఎగురుతాయి. ఆటి కింకోళ్ల సాయ వక్కర్లేదు. సొతంతరం సొరగలోకం. అసలు పిట్ట లెలాగుంటయ్యో? ఆటిలో ఎన్నో రకా లున్నాయని సెప్పుద్ది లచ్చి వక్క. రాంబందులూ, గద్దలూ, అంసలూ లాంటి పెద్దపెద్దయ్యీ, సిలకలూ, పావురాలూ, పిసికలూ లాంటి సిన్నసిన్నయ్యీ ఎన్నెన్నో [illegible] పిసిక నా [illegible] ఓరేనా [illegible] బాగుణ్ను. సెంచుగుండును. 'బాబూ, ధరమం' అనకుండా 'బాబూ, బంగారు పిసిక' అంటే ఎలాగుంటాది? ఆమ్మో అయ్య సంపెయ్యడూ! డబ్బున్నోళ్లని బంగారప్పిసిక లంటా డయ్య. నే నలా గంటే ఎటకార వాడతన్నా ననుకుంటా రేమో ఆళ్లు.

అది సరేగాని, ఇందాక ఆ కిళ్లీకొట్టు కాడ కుర్రాళ్లన్నది నిజవేనా అని? నిజంగా ఆళ్లంత టోళ్ళు, లేపోతే ఆళ్ల అయ్య అమ్మలు ఆలా సేత్తారా అని? అలాటి దురమార్గు లస లుంటారా అని? అలాటో ళ్లసలు మడుసులేనా అని? ఇదేదో లచ్చివక్క నడగాలి. లచ్చి వక్క ఎలా ఉంటుందో? సాచ్చాత్తూ ఆ లచ్చిం దేవిలా ఉంటుందేమో? ఆ లచ్చిందే వెలా ఉంటుందో? లచ్చి వక్కే, లేపోతే నా బతుకే వైపోయేదో? లచ్చి వక్కని ఒక్క సారి సూడాలని ఉంది. ఒక్కసారి సూత్తే సాలు. మొన్న అరిదాసుగారి బారతం కతలో గుడ్డి రాజా కిట్ట పర మాత్ముణ్ణి ఒక్కసారి సూసి మళ్లీ గుడ్డోడయి పోయాట్ట. అలా లచ్చి వక్కని ఒక్కసారి సూత్తే సాలు. తరవాత ఈ బతుకంతా గుడ్డిగా బతికెయ్యచ్చు.

ఇంటి కొచ్చేసినావులా ఉంది. 'గుడ్డోడు, గుడ్డోడు' అంటున్నారు బైరాగ్గాడి పిల్లలు.)

"ఇంటి కొచ్చినావురా. ఇదో సెట్టు. ఈడ కూకో" అన్నాడు ముసలాడు.

మర్రిచెట్టు మొదల్లోనుకుని కూర్చున్నాడు వెంకన్న. ఇరవై గజాల దూరంలో ఇంకో మర్రిచెట్టుంది. ఈ రెండు మర్రిచెట్ల క్రింద నాలుగు కుటుంబాలు కాపురం చేస్తున్నాయి. ముసలాడు, కొడుకు కాపురమున్న చెట్టు కిందే సాధువు, లక్ష్మి ఉంటున్నారు. రెండో మర్రిచెట్టు కింద ఒక వైపు ఇద్దరు పెళ్లాల బైరాగి, ఇంకోవైపు మూర్ఛ బ్బాయి, తల్లి ఉంటున్నారు. పొద్దుట ఎనిమిది గంటలకల్లా కాషాయాంబరాలు, ముఖాన విభూతి, ఒక చేత దండం, ఇంకో చేత కమండలం ధరించి పరమ [illegible] తయారవుతాడు సాధువు. అతని వెంట చేతిలో తాళాలు, చంకన జోలి ధరించి శిష్యుడిలా బైరాగి తయారౌతాడు. సాధువుకి చాలా పాటలు వచ్చును. అతడు పాడుతుంటే బైరాగి వంత పాడతాడు. ఇద్దరూ నగర సంచారం చేసి మధ్యాహ్నం ఏ చెట్టుకిందో చేరి 'ఇంటి' దగ్గర్నుంచి తెచ్చుకున్న అన్నం తింటారు. ఆ తరవాత కాస్సేపు విశ్ర మించి, ఓపికుంటే రెండు మూడు వీధులు చూసుకుని సాయంత్రం చీకటి పడుతూంటే 'ఇంటికి' చేరుకుంటారు. మూర్ఛబ్బాయీ, తల్లీ పొద్దున్నే ఇంత అన్నం తినికాని ఊళ్లోకి వెళ్లరు.

సాధువుని కూడా అలా కాస్త అన్నం తిని వెళ్లమంటుంది లక్ష్మి. పొద్దున్నే ఎనిమిది గంటలకి అన్నమేమి టంటా డతను. సాధు వెలా చేస్తే బైరాగి అలా. అందుచేత ఆ మర్రిచెట్టు కింద ఆడ వాళ్ళు తెల్లారకుండా లేచి వంటలు చేసి మగవాళ్లకు ఎనిమిది గంటలకల్లా చిన్న అల్యూమినియం భరిణల్లో అన్నం సర్ది ఇస్తారు. ఒక ఫర్లాంగు దూరంలో ఉన్న జైల్లో ఎనిమిది కొట్టగానే సాధువు, బైరాగి బయలుదేరతారు.

లక్ష్మి వాళ్లొ రాకపూర్వం ముసలాడు వంట చేసేవాడు. కాని ఇప్పుడు ఎంతసేపూ తన్ని తిట్టుకొని కొడుకుని తిట్టి కాలక్షేపం చేస్తున్నాడు. వాళ్ల క్కూడా లక్ష్మి వండిపెడుతూంది.

లక్ష్మి సంప్రదాయమైన బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి చిన్నతనంలో కాలు జారి చివరకు సాధువు ఆసరాతో ఇక్క డకు వచ్చి పడింది. కాలేజీలో చేరిన కొత్తల్లో ఎర్రగా బుర్రగా ఉన్న ఒక కుర్రాడిని ప్రేమించి వాడితో లేచిపోయి ఆ తరవాత వాడివల్ల దగాపడి బలవంతాన బతుకు చాలించుకుందామని ఆలోచి స్తూంటే సాధువు తారసపడ్డాడు. అతని ఋషి రూపం చూస్తూ, అతని తత్త్వాల వింటూంటే ఆమెకు కొంత మనశ్శాంతి కలిగింది. ఏ మహర్షి సన్నిధిలోనే

పి. జి. రామారావు

ప్రమదావన దీపావళి కథల పోటీలో రెండవ బహుమతి పొందినది

ఉన్నట్లనిపించింది. భక్తిపారవశ్యంతో తన పాటలు వింటున్న ఆమెకు తన ఆధ్యాత్మిక అనుభూతులు వివరించాడు సాధువు. తన వెంట వస్తే ఆమెకూ అటువంటి అనుభూతులు కలుగుతాయనీ, దేవుడు కనిపిస్తాడనీ చెప్పాడు. తెగిన గాలిపటంలా ఉన్న లక్ష్మి ఈ అలంబన ఆసరాగా చేసుకుని ఇప్పుడు అతనిలో దేవుణ్ణి చూసుకుంటూ తరుతలవాసం చేస్తూంది.

"లచ్చివక్కా!"

"ఒక్క నిమిషం, తమ్ముడూ. అన్నం దించి వస్తాను" అంది లక్ష్మి.

నగర సంచారానికి వెళ్లిన కాక దంపతులు గూటికి చేరుకున్నట్లున్నాయి, కాకి పిల్లల కలకలం ఎక్కువగా ఉంది. మిగతా గూళ్ళు కూడా ఇలాగే ఉండి ఉంటాయి. రెండు మర్రిచెట్లూ చాలా సందడిగా ఉన్నాయి.

వెంకన్న తల పైకెత్తి, "ఏటి కెళ్ళినోళ్ళంతా గూటి కొచ్చిన ట్టున్నారు. గోల మాలావుగా ఉంది" అన్నాడు.

"లచ్చి వక్కా, అమ్మ గొంతింట న్నావా?"

"అమ్మెవర్రా?" అంది లక్ష్మి.

"ఇదిగో, మన్ని కడుపులో పెట్టుక్కాపాడే నల్లని తల్లి. సెట్టమ్మ. గోల పాడతా ఉంది. కాస్సేపట్లో అమ్మ ఒళ్లో పడుక్కుని నిద్దరోతాం."

"హోరి. అదా! నువ్వు కవివిరా."

"కవంటే ఏటి, లచ్చివక్కా?"

"కవంటే చూసేవాడురా. సత్యాన్ని చూసి చక్కగా చెప్పేవాడు."

"నేనేం సూడగల్నక్కా? గుడ్డోణ్ణి."

"అందరూ చూడలేనిదాన్ని నువ్వు చూసి ఆనందిస్తున్నావురా. నీలాంటి వాళ్లేరా నిజంగా కళ్లున్న వాళ్ళు. అబద్ధపు లోకాన్ని అబద్ధపు కళ్లతో చూస్తూ, నిజాన్ని చూడలేక, ఎప్పుడూ రోగిష్టి మనస్సులతో ఏడుస్తూ ఉండే మనుష్యులా, తమ్ముడూ, గుడ్డివాళ్లంటే."

"సదుగులేనోణ్ణి. నువ్వు సెప్పే పెద్ద పెద్ద మాటలు బుర్ర కెక్కవు. అది సరే గాని, లచ్చి వక్కా, నా మొహం బయవేసేలాగుందా?"

"అలా ఎవరన్నార్రా, పిరికి పందలు? నాకేం భయం వేయడంలేదే."

"భయం లేపోతే నా మొహం ముట్టుకోగలవా?"

"నీ ముఖానికేంరా, వెర్రినాగమ్మా. చిన్నప్పుడు కాలి కొద్దిగా మచ్చలు పడిందంతే. కాని నిన్నలా అన్న వాళ్ల మనస్సుల్లోని మచ్చలు నిజంగా భయంకరంగా ఉంటాయి" అంటూ వాడి ముఖం రెండు చేతుల్లోనూ తీసుకుని నిమిరింది లక్ష్మి.

"లోపలి మచ్చలు పై మచ్చల్లా కనిపిస్తాయా, లచ్చి వక్కా?"

"చూడగలిగినవాళ్లకి కనిపిస్తాయి. దృష్టి నిర్మలంగా ఉంటే మన మనస్సుల్లో మచ్చలూ, ఇంకోళ్ల మనస్సులో మచ్చలూ స్పష్టంగా కనిపిస్తాయి. ఈ దృష్టి మామూలు కళ్ల కుండదు. మనస్సుకే ఉంటుంది. తన ఒంటి మీది మచ్చలు అది చూసుకోగలదు. అలాగే ఇతరుల మనోదేహాల మీది మచ్చలూ చూడగలదు. ఇప్పుడు చూడు. వాళ్ళు నిన్నలా అన్నప్పుడు నీకు బాధ అనిపించ లేదూ? అప్పుడు వాళ్ల మనస్సుల్లోని మచ్చలు నీకు స్పష్టంగా కనబడలేదూ?"

"నువ్వు చెప్పింది రైటేలే. అవునుగాని, లచ్చి వక్కా, నాకో బంగారప్పిసికుంటే బాగున్ను."



వెలుగుకోసం

చిత్రం — బి. ఎల్. రామాంజనేయులు (గుంతకల్)

"ఎందుకురా? ఏంచేస్తావుదానితో?"

"పెంచుకుంటా. ఎప్పుడూ సేతిలో ఉంటాది. సిన్నగా నా సిటికెనేలంతుంటాదనీ, ముద్దొస్తా ఉంటాదనీ సెప్పావుగదా. ఎప్పుడూ దగ్గరుంటే సంతోసంగా ఉంటాది."

"నే నెప్పుడూ దగ్గరే ఉంటున్నాను గదా? ఎప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చి కబుర్లు చెబుతున్నా గదా?"

"రైటేలే గాని, నాకేమో అంతా సీకటి. ఆ పిసికని సేతిలో ఎట్టుకుని దాని గుండె సప్పుడింటా ఉంటే దయిర్యంగా ఉంటాదేమో అని. మా అయ్య దగ్గరెప్పుడూ బయంగానే ఉంటాది. అసలే సీకటి. ఆ సీకట్లో అయ్య. ఈ గూటికి సేరుకుని, నువ్వు పలికేదాకా బయమే."

"అదుగో, గురువుగా రొచ్చేశారు" అంది లక్ష్మి.

సాధువు సంతా "గురువుగారు" అంటారు. లక్ష్మి అలాగే అంటుంది. వాళ్లిద్దరి సంబంధం ఎలాంటిదో ఎవరికీ స్పష్టంగా తెలియదు. వాళ్లంటే ఉన్న భక్తి గౌరవాల వల్ల తెలుసుకోవాలనే కుతూహలం కూడా ఎవరికీ కలిగినట్లు లేదు. మాటల్నిబట్టి ఒకప్పుడు భార్యాభర్తల్లాగ, ఒకప్పుడు స్నేహితుల్లాగ, ఒకప్పుడు గురువు శిష్యురాలులాగ, వేరొకప్పుడు భక్తుడు దేవిలాగ, మరొకప్పుడు భక్తురాలు భగవంతుడు లాగ ఉంటారు.

"గురూగారూ, నా గూటికి పోతున్నాను" అన్నాడు బైరాగి ఆ నాడు పోగయిన బియ్యం వగైరాల పంపకమయ్యాక.

"పోగానే సరిగాదు. నీ పెళ్ళాలిద్దరూ జోలి శోధిస్తారు. ఏదయినా ఇద్దరికీ సమంగా పంచగలిగితేనే అందులో ఉంచు. లేకపోతే వాళ్ళకి అసలు కనబడనివ్వకు. ఒకళ్లని నెత్తికెక్కించుకున్నావంటే, ఇంకోళ్లకి శరీరంలో సగం ఇచ్చేయాల్సుంటుంది, జాగ్రత్త" అన్నాడు సాధువు గొంతు తగ్గించి.

"హి హి హి!" అని పళ్లికిలించి నవ్వి వెళ్లిపోయాడు బైరాగి.

"ఏటీ, గురూగారు బైరాక్కలా సెబుతున్నారు? ఈ డేరైనా ఎక్కణ్ణుంచైనా ఎత్తుకు రాలేదు గదా' అనుకున్నాడు వెంకన్న.

"గురువుగారి సంపాదన ఈ రోజు జోరుగా ఉన్నట్లుందే" అంది లక్ష్మి.

"తల్లి, జగజ్జననీ, రాజరాజేశ్వరీ,
అంతా నీ చలవే.
అక్షయంబుగ కాశిలోపల అన్నపూర్ణ
భవానివై
చెట్టు కిందా వెలసినట్టీ సద్గుణావతీ
శాంభవీ

అని పాడుకుంటూ వెడితే ప్రతి ఇంట్లోనూ భిక్ష దొరికింది."

"చాల్లెండి, వేళాకోళం. అవునుగాని, మన వెంకన్నకు బంగారు పిచిక కావాలట. మీ సిద్ధుల వల్ల అంఫట్ అని ఏవైనా తెప్పించగలరా?"

"ఓ, అదెంత పని! బంగారు పిచిక వచ్చాక దానికో గూడు వద్దూ? ముందు గూడు తెప్పించి తరవాత పిచిక సంగతి చూద్దాం. వెంకన్నా, ఇదుగో, గూడు వచ్చేస్తూంది. అంఫట్" అంటూ సాధువు వెంకన్న చెయ్యి పట్టుకుని పొడుగాటి తన గడ్డం మీద పెట్టాడు. "ఇది గూడు. ఈ గూటిలో కాపుర మున్న బంగారు పిచిక ఇదిగో." మళ్ళీ "అంఫట్, జై శాంభవీ" అంటూ వెంకన్న చేతిని లక్ష్మి చేతిలో పెట్టాడు.

ముగ్గురూ పగలబడి నవ్వుకున్నారు.

"గురూగారూ, ఎంత ఇవరంగా సెప్పారండీ! గొప్ప సత్తెం సెప్పారండీ. లచ్చివంక్కే బంగారప్పిసిక. నాకు మీ రిద్దరూ ఉండగా ఇక ఏరే బంగార ప్పిసి కెందుకండీ?" అన్నాడు వెంకన్న.

లక్ష్మి కరతల భిక్షగా ముద్దలుచేసి చేతుల్లో పెడుతుంటే నలుగురూ తిన్నారు. ఆ తరవాత సాధువూ బైరాగీ మరునాడు పాడవలసిన తత్వాలు రిహార్సల్ వేసుకున్నారు. "పార్వతిపతి శంకరా నీ పాదములు నెర నమ్మితీ" అని సాధువు పాడుతూంటే వెంకన్నకు ఒళ్ళు గగ ర్పొడిచి వర్ణనాతీతమైన తన్మయత కలి గింది. ఆ తన్మయత్వంలో అలాగే నిద్ర పోయాడు. ఇంకో సావుగంటలో మర్రి చెట్టు మాటు మణిగింది.

తెల్లవారి లేస్తూనే ముసలాడికి మూడు రోజులుగా ఉన్న కడుపునొప్పి ఎక్కువై మెలికలు తిరగ నారంభించాడు. కాస్సేపు ఉపచారాలు చేసి సాధువూ, బైరాగీ ఊళ్ళోకి వెళ్ళిపోయారు. ఇంకో గంటకి మూర్ఛబ్బాయీ, తల్లీ వెళ్ళారు. లక్ష్మి, బైరాగి పెళ్ళాలూ ఒకళ్ళను విడిచి ఒకళ్ళు ముసలాడి కడుపు పిసు రాసి ఏం చేసినా లాభం లేకపోయేసరికి విస్తుపోయుంగా వాడి బాధ చూస్తూ ఉండవలసి వచ్చింది.

ముసలాడు రోజల్లా బాధపడుతూనే ఉన్నాడు. సాయంత్రం లక్ష్మిని పిలిచి, "లచ్చివమ్మా, మా వెంకన్నని నీ కొప్ప గిస్తున్నా. అడి కళ్ళు ... అడి కళ్ళు ... నేనే ... నేనే ..., ఆ పాపానికి అనుభవి త్తున్నా" అన్నాడు. వెంకన్న చేతులు పట్టుకుని, "ఒరే, ఎంకన్నా, నీకు గోర మైన అన్నాయం సేశాన్రా. నన్ను ... దేవుడు ... చమించడ్రా" అని భోరున ఏడవసాగాడు.

"ఊరుకో, అయ్యా, ఊరుకో. సేసింది దేవుడైతే ఆడు నిన్ను చమిం చడమేంటి? సేయడానికి నువ్వెవరు? ఆడు మర తిప్పితే మనం ఆడతన్నాం. అయినా నా కిలాగే బావుంది. సెపంచ కంలో సూడ్డాని కేవుంది? నిన్న లచ్చి వంక్క సెప్పింది — నేనే కళ్ళున్నోణ్ణంట, కళ్ళున్నోళ్లంతా గుడ్డోళ్ళంట. గుడ్డోణ్ణని నాకేం బాద నేదు. నువ్వెందు కయ్యా ఏడ్డం?" అన్నాడు వెంకన్న తండ్రి గుండెల మీద రాస్తూ.

ఇంకో అరగంట గిలగిల్లాడి ప్రాణాలు వదిలాడు ముసలాడు. అంతా ఒక్కసారి నిశ్శబ్దమైపోయింది.

"లచ్చివంక్కా, పిట్టెగిరిపోయిందా?"

"ఊఁ" అంది లక్ష్మి బరువుగా పొంగి వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ.

"ఇదేం పిట్ట, లచ్చివంక్కా?"

"ఇది కాకిరా. మాలకాకి."

"మొన్నివరలో గొప్పిట్ట. అది కవా న్నూరేగిత్తా తీసికెళ్ళారు. అదేం పిట్ట లచ్చివంక్కా?"

"అది రాంబందో, గద్దో అయి ఉంటుంది."

సాధువు, బైరాగి తిరిగి వచ్చారు. ముసలాడి భౌతిక కాయం ఖననమయ్యే సరికి రాత్రి బాగా పొద్దుపోయింది.

"వెంకన్నా, నువ్వేం దిగులుపడద్దు. నీకు మేమున్నాం. నీ లచ్చివంక్కుంది" అన్నాడు సాధువు పడుకు నే ముందు.

వెంకన్నకి నిద్ర పట్టలేదు. కళ్ళలో నిండిన చీకట్లలోకి చూస్తూ కూర్చు న్నాడు. కాసేపయ్యాక లక్ష్మి అడిగింది: "ఏరా, తమ్ముడూ, నిద్ర పట్టలేదా?"

"లేదు, లచ్చివంక్కా."

"అయ్యకోసం బెంగగా ఉందా?"

"బెంగ లేదక్కా. ఏటో ఆలోశన్లు. రాత్తిరి ఏటేటో కబుర్లు సెప్తాద్ది. గాలి ఏటేటో గుసగుస లాడుద్ది. అలకిత్తన్నాను."

"ఏం విన్నావురా?"

"సెట్టు పిట్ట సెట్టు పిట్ట. పుట్టు గిట్టు పుట్టు గిట్టు అని ఒకటే రొద. సెపంచకమంతా పెద్ద సెట్టు. దీన్ని పుట్టించినోడు దేవుడు గద! అందేట దీని ఏళ్ళు పైన, కొమ్మలు కింద. సెట్టు నిండా పిట్టలు. రకరకాల పిట్టలు. ఎగిరిపోతా ఉంటాయి. వాల్తా ఉంటాయి. ఆదిగో, 'పొట్ట పొట్ట' అని సెబుతూంది రాత్తిరి. ఇను. సెవొగ్గి అలకించు."

లక్ష్మి శ్రద్ధగా వింది. దూరంగా ఎక్కడో ఏదో కొడుతున్నట్టు టక్, టక్ మన్న శబ్దమూ, ఇంకో వైపు పాము నోట్లో చిక్కుకున్న కప్ప ఆర్తనాదమూ, ఇల కోడి కూత, కీచురాళ్ల రొద తప్ప ఇంకేమీ వినబడలేదు.

"ఎక్కడో పాము కప్పను పట్టు కొంది" అన్నది.

"పాపం, దానిదీ పొట్టే గద? మన్లా ఇంటింటికీ ఎళ్లి అడుక్కోగల్దా పాము? ఒటేల్లో దూరి తినగల్దా? ఆ గొప్పోడిలా ఇంకోళ్ల నోరు కొట్టి పొట్ట పోసుకోగల్దా? 'కప్పా, నా కాక లవుతా ఉంది' అంటే కప్ప దాని కన్నం పెట్టగల్దా, లేపోతే తన్ని తానే కోసుకుని కూరొండి పెట్టగల్దా? మరి పాము పొట్టెలా నిండుద్ది? అందుకే రాత్తిరి పుట్టు పొట్ట గిట్టు, పుట్టు పొట్ట గిట్టు' అంటూంది."

"నువ్వు వేదాంతివిరా, తమ్ముడూ" అంది లక్ష్మి ఆవులిస్తూ.

"ఏదాంతానికేం గాని శానా రాత్తి రయింది. ఇక నిద్దరో, లచ్చివక్కా. మళ్లీ కోడి కుయ్యకండా లేచి గురూగారి ఆపీసు టయింకి అన్నం చిద్దంచెయ్యాలి."

"నువ్వూ నిద్దరో. వత్తిగిలి పడుకో" అంటూ పగలల్లా ముసలాడి ఉపచారా




లతో అలసిన లక్ష్మి నిద్రాదేవి ఒళ్ళో ఒరిగిపోయింది.

'ఇదేటో, ఎల్లకిలా పడుక్కుంటే పీడకల్లొత్తయ్యంటారు' అనుకుంటూ వత్తిగిలి పడుకున్నాడు వెంకన్న. ఫైల్లో రెండు కొట్టారు.

చెట్టు కింద జరుగుతున్న గందర గోళానికి మెలకువ వచ్చింది వెంకన్నకు. బైరాగి పెళ్ళాలు ఏడుస్తున్నారు. పోలీసులు బైరాగి వస్తువులు సోదా చేస్తు న్నారు. సాధువు, బైరాగి, మూర్ఛబ్బాయి ఎవరూ లేరు. అప్పుడే ఊళ్ళోకి వెళ్ళి పోయిన ట్లున్నారు. తాను, లక్ష్మిమక్క, బైరాగి పెళ్ళాలు, పిల్లలు మాత్రం ఉన్నారు. పోలీసు ఇన్స్పెక్టరు, హెడ్ కానిస్టేబిల్, ముగ్గురు కానిస్టేబుళ్ళు హడావుడి చేస్తున్నారు. ఈ హడావుడిలో తనకు, లక్ష్మిమక్కకు అర్థమయిం దేమి టంటే, బైరాగి ఎక్కడిదో వజ్రాల ముక్కుపుడక ఎత్తుకొచ్చి దాన్ని తనకు ముక్కువైన చిన్న పెళ్ళాని కిచ్చాడట. పెద్దపెళ్ళాం ఉక్రోషం పట్టలేక ఈ సంగతి మూర్ఛబ్బాయి తల్లికి చెబితే అది తన కొడుక్కి చెబితే, వాడది తన కడుపులో దాచుకోలేక తనకు కాస్త పరిచయమున్న పోలీసు వాడికి చెప్పాడట.

పోలీసుల సోదా పూర్తయింది. ముక్కుపుడక బైరాగి చిన్న పెళ్ళాం చీర కొంగున ముడేసి ఉన్నది హెడ్ కానిస్టేబిలు పట్టేశాడు.

"ఏమే, నంజానా, ఏమంటావ్?" అని గర్జించాడు హెడ్డు.

ఆమె అతడి పాదాలు పట్టుకుని, "ఏలినోరి పాదాల దగ్గర బతికే వోళ్లం. సెబువులు రచ్చించాలి" అంటూ వలవల ఏడవసాగింది.

ఇన్స్పెక్టర్ కానిస్టేబుళ్లను పిలిచి, "ఒరే, మీ రా రెండో మనిషినీ, పిల్లల్నీ తీసుకెళ్లి ఆ ఎదర రామకోవెల వాకిట్లో కూర్చోబెట్టి ఇలా ఎవరూ రాకుండా చూడండి" అని అర్డరేశాడు. వాళ్ళు "కుయ్యో మొర్రో! మే మేమీ ఎరగ" మని మొరపెట్టుకుంటున్న బైరాగి పెద్ద పెళ్లాన్నీ, పిల్లల్నీ తీసుకుపోయారు. వాళ్లలా వెళ్లగానే ఇన్స్పెక్టర్ హెడ్డు చెవిలో "నువ్వీ బేరం చూసుకో. నే నా గుడ్డోడి పక్కనున్న ఆడమనిషి సంగతి కనుక్కొస్తాను" అన్నాడు.

'తనకన్నీ కనిపిస్తుంటే గుడ్డో డంటా డేమిటి? ఇన్స్పెక్టర్ హెడ్డు చెవిలో రహస్యంగా చెప్పిన మాటలు కూడా తనకు వినిపించాయే. విచిత్రంగా ఉంది' అను కుంటూంటే ఇన్స్పెక్టరు తమ వైపు తిరిగాడు. హెడ్డు తన పాదాలు పట్టు కుని ఏడుస్తున్న బైరాగి చిన్న పెళ్ళాన్ని

చెయ్యిపట్టుకు లేవదీసి ఆ పక్క పొదల చాటుకి తీసుకుపోయాడు.

ఇన్‌స్పెక్టర్ తమ దగ్గరకు వచ్చాడు. లక్ష్మీమక్క అతనివైపు తీవ్రంగా చూస్తూ "ఏమిటండీ ఇది? పోలీసులే ఇలా చేస్తే ఎలాగ? మీరు ఇన్‌స్పెక్టర్. ఆ పోడ్నని పిలిచి కోప్పడండి" అన్నది.

"ఏం? నీకూ కాడా వేషీ వెయ్యా లేంటి? నా మా టిన్నా వంటే నీ మీద కేసు లేకుండా చూస్తాను. ఇవా డా. అల్ల గొడవ మన కెందుకు?" అంటూ మీదికి రాబోయాడు ఇన్‌స్పెక్టర్

"దగ్గరకు రాకండి మీరు పోలీ సాఫీసరని మరిచిపోతున్నారు" అంది లక్ష్మీమక్క.

తాను ఊరుకోలేక, "బాబూ, లక్ష్మీ మక్కంటే నిప్పు. దగ్గరకు రాకండి" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ తన మాట అసలు వినబడ నట్టు— "పిడున్నాడని ఇదవుతున్నావా? ఫరవాలేదు. గుడ్డోడేగా. లేపోతే ఇలా ఈ తుప్ప వెనక్కి పోదాం, పద" అంటూ లక్ష్మీమక్క చెయ్యి పట్టుకున్నాడు.

లక్ష్మీమక్క కళ్ళలో నిప్పులు కురి శాయి. "నోర్మూయ్, పశువా" అంటూ ఇన్‌స్పెక్టర్ దవడమీద కొట్టింది.

ఇన్‌స్పెక్టర్ నడుముకున్న పటకా తీసి, "ముష్టిలంజా! ఇంత పొగరా నీకు!" అంటూ ఛెళ్ళు ఛెళ్ళున రెండు దెబ్బలు కొట్టాడు లక్ష్మీమక్కని. "నావూ టెనకపోయావంటే జైల్లో ఒళ్ళు కమిలిపోయేలా దెబ్బలుతింటావు. మర్యా దగా రా" అంటూ లక్ష్మీమక్క నోరొక చేత్తో మూసి తుప్పలవైపు ఈడ్చుకుపో పోగాడు. రెండడుగులు వేశాడో లేదో కివ్వుమని పెద్ద కేక పెట్టాడు. లక్ష్మీ మక్క బంగారు పిచికైపోయి ఇన్‌స్పెక్టర్ కళ్ళు రెండూ పొడిచేసి ఎగిరిపోయింది. ఇన్‌స్పెక్టర్ గుడ్డివాడయిపోయి వెర్రెత్తి నట్టు పటకా విసురుతుంటే అది తన భుజం మీద ఛెళ్ళున తగిలింది.

"అయ్యో లక్ష్మీమక్కా, నా బంగారు పిచికా!"

"తమ్ముడూ, ఏంటా పలవరింతలు" అంటూ భుజం మీద తట్టి లేపింది లక్ష్మి.

"ఏటో పీడ కల. ఎదవ ఇన్‌స్పెక్టరు. నువ్వు బంగారప్పిసికైపోయి ఆడి కళ్ళు పొడిసేసి ఎగిరిపోనావ్. నువ్వెగిరిపోనా వని నే నేడుత్తా ఉంటే పైకొచ్చేసి నాదిలా ఉంది."

"నే నెక్కడికీ ఎగిరిపోను తమ్ముడూ. మనమంతా చెట్టమ్మ ఒళ్ళో సురక్షితంగా ఉన్నాం. ఒత్తిగిలి పడుకుని నిర్భయంగా నిద్దరో" అంది లక్ష్మి.

"ఏటో, లచ్చివక్కా" అంటూ ఒత్తిగిలి పడుకున్నాడు వెంకన్న. ★

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# ప్రమాదీచ దీపావళి కథలపోటీ: బహుమతి గ్రహీతలు



శ్రీ జయంతి వెంకటరమణ

మొదటి బహుమతి పొందిన 'వంతెన' రచించిన వారు. 1943 జనవరిలో తూర్పు గోదావరి జిల్లా భద్రాచలంలో జన్మించారు. ఏలూరులో కళాశాల విద్యాభ్యాసం. విజయనగరంలో ఉపాధ్యాయ శిక్షణ కొనసాగించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా మందసాలో సైన్సు ఉపాధ్యాయులుగా ఉన్నారు. 1964 నుంచి 'ఊర్వశి' కలంపేరుతో సుమారు ముప్పై కథలు రచించారు. అన్నీ ప్రచురితమైనవి. 'కళ్యాణ తిలకం' నవల కూడా రచించారు.

డాక్టర్ పి. జి. రామారావు

రెండవ బహుమతి పొందిన 'చెట్టమ్మ ఒళ్ళో' రచించినవారు. పూర్తి పేరు శ్రీ పెదపూడి గంగా రామారావు. 1935 లో జననం. కాకినాడ పి. ఆర్. కాలేజీలో చదివిన తరవాత కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో ఎమ్. ఎ. (ఇంగ్లీషు). ఉత్కళ విశ్వవిద్యాలయం పిహెచ్. డి. (ఇంగ్లీషు లిటరేచర్) సంపాదించారు. ప్రస్తుతం ఒరిస్సా కటక్ జిల్లాలోని కేంద్రపారా కాలేజీలో ఆంగ్లశాఖ ప్రధానాధ్యాపకులుగా ఉన్నారు. తెలుగు రచనలు కాక 'ది పొయెటిక్ రాప్చర్' (సాహిత్య విమర్శ గ్రంథం). ఎర్నెస్ట్ హెమింగ్వే, విలియమ్ ఫాక్‌నర్లపై పరిశోధనా వ్యాసాలు రచించారు.





డాక్టర్ వి. వి. సూర్యనారాయణ

మూడవ బహుమతి పొందిన 'కారెక్కాలని ఉంది' రచించినవారు. 1944 ఫిబ్రవరిలో విశాఖపట్టణం జిల్లా భీమునిపట్నంలో జన్మించారు. 1967 లో ఎమ్. బి., బి. ఎస్., డి. ఎ. సంపాదించారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్. ప్రస్తుతం ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎమ్. డి. (అనిస్థీషియాలజీ) చదువుతున్నారు.